హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి

- మనమే తలా ఒక రూపాయి చందా వేసుకుని ఈ గుడిని పునర్నిర్మించుకోవాలి
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి

4



సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశానికి హాజరైన టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డికి మొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలో మాట్లాడుతున్న టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

దిశ సమావేశంలో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు అధ్యక్షతన జరిగిన దిశ సమావేశంలో టీజీఐసీ చైర్‌పర్సన్‌కు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. టీజీఐసీ చైర్‌పర్సన్ హోదాలో తొలిసారిగా దిశ సమావేశానికి హాజరైన నిర్మలా జగ్గారెడ్డికి కలెక్టర్ మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితర ప్రముఖులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అర్హులకు అందించే బాధ్యత అధికారులదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతున్నాదని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు.

కళ తప్పిన కల్యాణ మండపం

5

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, మే 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. దుబ్బాక ఆసుపత్రిలో సీఏఎస్ జీడీఎంవో-1 పోస్టు, జిల్లా ఆసుపత్రి గజ్వేల్‌లో సీఏఎస్ గైనకాలజీ-1, సీఏఎస్ జీడీఎంవో-1, చేర్యాల ఏరియా ఆసుపత్రిలో సీఏఎస్-అనస్థీషియా-1, సీఏఎస్ జీడీఎంవో-2, హుస్నాబాద్ ఏరియా ఆసుపత్రిలో సీఏఎస్-అనస్థీషియా-1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, కాంట్రాక్టు ప్రాతిపదికన ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా పోస్టులకు ఈ నెల 8 నుంచి 13 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ ఆఫీసులో ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఎంపిక విధానం పీజీ, డిప్లొమాలో మెరిట్ ఆధారంగా ఉంటుందని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 34 ఏళ్ల మధ్యలో ఉండాలని, ఎస్సీ ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు

కెనడాలో బొప్పాపూర్‌వాసి మృతి


దుబ్బాక, మే7 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్‌కు చెందిన వ్యక్తి కెనడాలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ములుగు దుబ్బరాజేశ్వర్‌రావు, లక్ష్మిబాయికి ఇద్దరు కుమారులు నవీన్‌రావు, ప్రవీణ్‌రావు. వీరు కెనడాలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నకుమారుడు ప్రవీణ్‌రావు(38) కొన్నాళ్లుగా క్యాన్సర్ బాధపడుతూ అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఇటీవలే తల్లిదండ్రులు ఇటీవల కెనడా వెళ్లారు. చికిత్స పొందుతున్న ప్రవీణ్ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య వందన, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు అక్కడే నిర్వహించనున్నట్టు తెలిసింది.

ఇప్పట్లో లేనట్టే!

ప్రశ్నార్థకంగా సర్పంచ్ ఎన్నికల నిర్వహణ

సర్పంచ్ ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసి ఇప్పటికీ 15 నెలలు గడిచాయి. అప్పటి నుంచి వివిధ కారణాలతో ఎన్నికల నిర్వహణ వాయిదా వేస్తూ వచ్చారు. ఇటీవలే రాష్ట్రంలో కులగణన పూర్తికాగా, రెండుమూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ ఉంటుందని భావించిన ఆశావహులకు మళ్లీ నిరాశ తప్పేటట్లు లేదు. తాజాగా దేశమంతటా కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశమున్నది.

- కేంద్ర కులగణన నేపథ్యంలో మరింత జాప్యం
- ఆశావహుల ప్రయత్నాలకు మళ్లీ బ్రేక్
- రిజర్వేషన్లలో సామాజిక వర్గాల లెక్కలే కీలకం
- 15 నెలలుగా ప్రత్యేక అధికారుల పెత్తనం
- గ్రామాల్లో కుంటుపడుతున్న పరిపాలన



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే7: ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్న చందంగా మారింది సర్పంచ్ ఎన్నికల పరిస్థితి. 2024 జనవరి నెలతోనే గత సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసింది. ఇప్పటికి 15 నెలలు గడుస్తున్నా ఎన్నికల ఊసే లేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని వాయిదా వేస్తూ వచ్చారు. ఇటీవలనే కులగణన సైతం పూర్తయ్యింది. ఇక వచ్చే జూన్, జూలై మాసాల్లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే తాము కూడా దేశమంతటా కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించింది. దేశమంతా సామాజిక వర్గాల వారీగా లెక్కలు తీయాలంటే ఇప్పట్లో కాదనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వచ్చే ఆరునెలల్లో కూడా ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగానే మారింది. ఐదేళ్లకోసారి నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికలు అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వస్తున్నాయి. ఫలితంగా సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులే 15 నెలలుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొంటున్నాయి. ప్రత్యేకాధికారులు సరైన పర్యవేక్షణ చూపించకపోవడంతో పనుల నిర్వహణ భారంగా మారుతోంది. తాజా పరిణామాలతో మరో ఆరు నెలల పాటు ప్రత్యేకాధికారులే పెత్తనం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రెండేళ్లుగా ఎదురుచూపులే

2024 జనవరి నెలలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారని ఆశావహులంతా ఆరు నెలల ముందు నుంచే సిద్ధమయ్యారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రిజర్వేషన్లను పదేళ్ల పాటు అమలు చేస్తారని నాడు నిర్ణయించడంతో ఆ రిజర్వేషన్ల ప్రకారమే ఆశావహులు రంగంలోకి దిగారు. ఇంతలోనే గత ప్రభుత్వ స్థానంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పాత రిజర్వేషన్ల స్థానంలో కొత్త రిజర్వేషన్లు తెస్తామని ప్రకటించడంతో ఆశావహులు ఊసురుమన్నారు. దీనికితోడు కులగణన చేపట్టడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుండగానే యేడాది సమయం గడిచిపోయింది. ఇటీవలనే కులగణన పూర్తయ్యి రాష్ట్రంలోని సామాజిక వర్గాల వారీగా లెక్కలు సేకరించారు. ఇప్పటికైనా ఎన్నికలు జరుగుతాయనే ఊగిసలాటలో ఉండగానే కేంద్ర కులగణన పేరిట మరో పిడుగు ఆశావహుల నెత్తిన పడింది. ఇప్పటికే 2 సంవత్సరాలు ఎదురుచూసిన వారంతా మరో ఆరు నెలలు పాటు వేచిచూడక తప్పదేమోననే ప్రచారం జరుగుతోంది.

వచ్చే రెండు నెలలపై ఆశలు

ఆశావహులంతా జూన్, జూలై నెలలపై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో కులగణన పూర్తయిన క్రమంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని ఎదురు చూస్తున్నారు. వేసవి దృష్ట్యా ప్రచారానికి, పోలింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతాయని భావించి జూన్ లేదా జూలై మాసాల్లో ఎన్నికల ప్రక్రియకు అనుకూలంగా ఉంటుందనే సంకేతాలు వచ్చాయి. ఆశావహులు సైతం అదే విశ్వాసంతో గుట్టుగా తమనుతాము ప్రజల్లో బలోపేతం చేసుకునే దిశగా సాగిపోతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం దేశమంతటా కులగణన చేపడతామని తాజాగా ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రంలోనూ మరోసారి కులగణన చేపట్టనున్నారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం కొనసాగుతున్న క్రమంలో ఇది పూర్తయ్యాకనే కులగణన మొదలవుతుందని అంచనా వేస్తున్నారు.



కుంటుపడుతున్న పాలన

గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధుల కేటాయింపు నిలిచిపోయింది. కేంద్రం నుంచి నిధులు విడుదల కావడం లేదు. పల్లెల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులతో కూడిన పాలకవర్గం ఉంటేనే ఆర్థిక సంఘంతోపాటు ఇతర నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం ప్రత్యేకాధికారులు

- మిగతా 5వ పేజీలో...

లారీల కొరత రాకూడదు

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ మనుచౌదరి సిద్దిపేటఅర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం పరిశీలించి ప్రస్తుతం ఎన్ని ట్రక్కుల ధాన్యం రవాణాకు సిద్ధంగా ఉందని, వర్షాలతో ధాన్యం ఏమైనా తడిసిందా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నామని అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్‌రైస్ మిల్లులకు పంపుతున్నామన్నారు. అదనంగా 2 ప్యాడీక్లీనర్లను ఈసెంటర్‌లో సమకూర్చుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజుకు సూచించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్, మే 7 (ఆంధ్రజ్యోతి): నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ మనూచౌదరిని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి కోరారు. బుధవారం ఆయన నివాసంలో మల్లన్నసాగర్ నిర్వాసితులు ఆయనను కలిసిన సందర్భంగా కలెక్టర్‌కు ఫోన్ చేసిన పలు అంశాలపై చర్చించారు. నిర్వాసిత కాలనీలో కనీసం సౌకర్యాలు లేవని శ్మశానవాటిక లేక ఒకే చోట అంత్యక్రియలు జరుపుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మల్లన్న సాగర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసినట్లయితే వెంటనే జీవో ప్రభుత్వం జారీ చేయాలని, సీడీఎంఏ ద్వారా తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల కాలనీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారా? గ్రామ పంచాయతీలుగా కొనసాగిస్తున్నారా? అని కలెక్టర్ మను చౌదరిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో విలీనం కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపినట్లు కలెక్టర్ ఫోన్ ద్వారా ఎమ్మెల్సీకి వివరించారు.



చేర్యాలలో..



గజ్వేల్‌లో..



తొగుటలో

విజయ సిందూరం

చేర్యాల/గజ్వేల్/తొగుట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరిట భారతసైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేయడంపై బుధవారం జిల్లాలో సంబురాలు జరుపుకున్నారు. చేర్యాలలో శివాజీ మహారాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శివాజీ విగ్రహం వద్ద జాతీయజెండాలతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం బాణసంచా కాల్చారు. గజ్వేల్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు సంబురాలు చేసుకున్నారు. జాతీయ జెండాను పట్టుకుని ఎన్‌సీ సంతోష్ గుప్తా, నంగునూరి సత్యనారాయణ, గోలీ సంతోష్‌కుమార్‌లు జైహింద్ అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదానికి మన దేశంలో చోటు లేదని బీజేపీ తొగుట మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్ అన్నారు. తొగుటలో బీజేపీ నేతలు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

పథకాలు పూర్తిస్థాయిలో అందాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట/సిద్దిపేట కలెక్టరేట్/కోహెడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధతో కలిసి జిల్లాలో అకాల వర్షాల వల్ల పంట నష్టం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, వేసవికాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో సామాన్య వ్యక్తులకు, ప్రతి పేదవారికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచితంగా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ కిరణం తదితర పథకాలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పేదలలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు త్వరగా పేమెంట్ జరిగేలా చూడాలని, అకాల వర్షాలతో తడిసన ధాన్యం ఆలస్యం చేయకుండా రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అయిల్‌పాం సాగును పెంచాలని, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 90 శాతం పైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు వేదికను ఏర్పాటు చేయాలని చెప్పారు. డబుల్‌లేన్ రోడ్లకు ఇరువైపులా ఈత, తాటి ఇతర పండ్ల మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, డీపీవో దేవకీదేవి, డీసీఎస్‌వో తనూజ, డీఎం సివిల్ సప్లయ్ ప్రవీణ్‌కుమార్, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకు భూ భారతి చట్టం

రాష్ట్రంలో ధరణి పోర్టల్ ద్వారా భూ పంచాయతీలు పెరిగాయని, భూ సమస్యలు పరిష్కరించేందుకే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూ భారతి చట్టం తీసుకువచ్చామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం జనగామలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉగ్రవాదులపై దాడి చేసి ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సైనికులకు అభినందనలు తెలిపారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి అయిలయ్య, తహసీల్దార్ అనంతరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగిస్తున్నాం. చెక్కుల పంపిణీ కూడా ఎక్కడా ఆలస్యం జరగడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం కోహెడలో 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.

ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, మే7 (ఆంధ్రజ్యోతి); అప్పులు తెచ్చి రైతులు పంటలు పండిస్తే రాష్ట్రంలో ధాన్యం కొనే దిక్కులేకుండా పోయిందని, ధాన్యం కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి కలెక్టర్, ఆర్డీవోలకు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి రైతులు పంటను పండిస్తే తరుగు పేరుతో దాదాపు 5 కిలోలు కట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు అప్పులు తెచ్చి మరీ పంటలు పండిస్తే వారిని పట్టించుకునే వారు లేరని, ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు గాలి మోటార్లు ఎక్కి తిరగడమే తప్ప రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అప్పులు పుట్టడం లేదని చెప్పడంలో రేవంత్ ఫెయిల్ అయ్యారన్నారు. పరిపాలన చేతకాకపోతే దిగిపోవాలని హితవు పలికారు. సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో అభయాంజనేయ దేవాలయంలో అన్నదాన భవనంను ప్రారంభించారు. కార్యక్రమంలో సూడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆత్మ కమిటి మాజి చైర్మన్ ప్రభాకర్ వర్మ,మున్సిపాల్ మాజి చైర్మన్ రాజానర్సు, మాజి సర్పంచ్ అంజనేయులు,నాయకులు ఎల్లారెడ్డి, హరీష్, బాలముల్ల పాల్గొన్నారు.

సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

సిద్దిపేట క్రైం: కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట అభివృద్ధి పనులను అడ్డుకుంటుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 195 మంది లబ్ధిదారులకు 43 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. సీఎం మాటలు గద్దెకు ఎక్కేవరకు ఒక్కమాట గద్ద ఎక్కాక ఒకమాట మాట్లాడుతున్నారన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు



హిందూ ధర్మాన్ని కాపాడాలి

● త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి

మర్కుక్, మే 7 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడడానికి అందరూ ముందుండాలని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని వరదరాజపురంలో బుధవారం నిర్వహించిన శ్రీ బూనీలా సమేత వరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నజీయర్ స్వామి హాజరయ్యారు. గర్భగుడిలో యంత్ర ప్రతిష్ఠ చేసిన అనంతరం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ యాదవ్‌లతో కలిసి ఆయన గుడి ప్రాంగణమంతా తిరిగి పరిశీలించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ ఈ గుడిని దాతల సహకారంతో నిర్మించి బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త గోపాలకృష్ణ, గొడుగు నరసింహులు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ గృహాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసే విషయంలో స్థానిక వనరులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో సంబంధిత అధికారులకు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలన్నారు. జిల్లాలో 1 లక్షా 74 వేల క్యూబిక్ మీటర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అవసరం ఉంటుందని స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరాకు గ్రౌండ్ వాటర్, రెవెన్యూ, మైన్స్ శాఖల సమన్వయం ద్వారా జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. జూన్ 2 నుండి జిల్లాలో ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహణపై ఆర్డీవోలకు తాసిల్దార్లకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు చేసారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీవోలు, మెదక్ రమాదేవి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, మైనింగ్ అసిస్టెంట్ జువాలజిస్ట్ మధు కుమార్, ఆర్.ఐ. లక్ష్మీనారాయణ, సంబంధిత తాసిల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గీతం విద్యార్థికి డాక్టరేట్

పటాన్‌చెరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సీహెచ్. మంగమ్మ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'నిలువు పోరస్ ప్లేట్ అంతటా మాగ్నెటో హైడ్రోడైనమిక్ ద్రవ ప్రవాహం యొక్క వేడి, ద్రవ్యరాశి బదిలీ ప్రభావం' అనే అంశంపై ఆమె అద్భుతమైన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల సిద్దులు మల్ల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ మంగమ్మ అయస్కాంత ప్రభావంలో న్యూటోనియన్ కాని ద్రవ ప్రవాహాల సంక్లిష్ట ప్రవర్తనను అన్వేషించినట్లు తెలిపారు. ఆమె పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, తదితరులు అభినందించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసులో యువకుడి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ కేసులో యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన బుధవారం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటి గ్రామంలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన దేవేంద్ర (28) మూడు రోజుల నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు వచ్చింది. ఈ నేపథ్యంలో దేవేంద్ర మృతదేహం ఓ ఇంటి నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లో దొరికింది. మృతదేహాన్ని బీడీఎల్ పోలీసులు పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా ముగ్గురికి గాయాలు

రేగోడు, మే 7 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రేగోడు మండలం ఆర్ ఇటిక్యాలలో జరిగింది. రేగోడు నుంచి వెళుతున్న ఆటో అదుపు తప్పి ఆర్ ఇటిక్యాల వద్ద బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న గ్రామానికి చెందిన బాలయ్య, శాంతయ్య, కృష్ణలకు గాయాలయ్యాయి. వారిని రేగోడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా వారికి ప్రథమ చికిత్స చేసి పంపించామని వైద్య సిబ్బంది సునంద తెలిపారు.

స్లాబ్ పైకప్పు కూలి ముగ్గురి కార్మికులకు తీవ్ర గాయాలు



కూలిన స్లాబ్

పటాన్‌చెరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్లాబ్ పైకప్పు కూలి ముగ్గురు కార్మికులకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం బీడీఎల్ పాటి గ్రామంలో జరిగింది. పోలీసులు అందించిన కథనం ప్రకారం పాటి గ్రామంలో నిర్మాణంలో వున్న కాలేజీ భవనం స్లాబ్ పైకప్పు కూలి ముగ్గురు కార్మికులకు తీవ్రమైన గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్లాబ్ కూలే సమయంలో కార్మికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. మీడియా వాళ్లు, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టేపొలం తండాలో వాంతులు, విరేచనాలు



చికిత్స పొందుతున్న బాధితులు

రేగోడు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టేపొలం తండాకు చెందిన పలువురు బుధవారం వాంతులు విరేచనాలతో రేగోడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పట్టేపొలంతాండాలో మంగళవారం దసరా పండుగ జరుపుకున్నారని, ఫుడ్ పాయిజన్ వల్లే వాంతులు విరోచనాలు జరిగి ఉంటాయని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వాంతులు విరోచనాలతో ఆసుపత్రికి వచ్చిన వారిని చికిత్స చేసి పంపించామని అన్నారు.















ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలి

ములుగు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సింగన్నగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను, అనంతరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్త పరీక్షల నమూనాలు సేకరించే విధానాన్ని, రికార్డులను, ఫార్మసీ స్టోర్‌కు వెళ్లి ముందుల నాణ్యతను పరిశీలించారు. వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పద్మావతి, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి 'పల్లా' పరామర్శ

ధూళిమిట్ట/మద్దూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న బైరాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ బర్మ రాజమల్లయ్యను, ఇటీవల పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఇర్ఫాన్ కుటుంబ సభ్యులను బుధవారం వారి స్వగృహంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా మద్దూరు మండలం లద్నూరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కాసర్ల కనకరాజు తండ్రి రామస్వామి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పల్లా పరామర్శించారు.

కళ తప్పిన కల్యాణ మండపం

- నాడు పెళ్లిళ్లు, శుభకార్యాలకు కేరాఫ్‌గా టీటీడీ కల్యాణ మండపం
- ఫంక్షన్‌హాళ్ల సంస్కృతితో నిరుపయోగంగా మారిన వైనం
- ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కోరుతున్న స్థానికులు



దుబ్బాకలో నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మండపం

దుబ్బాక, మే 7 (ఆంధ్రజ్యోతి): దాదాపు దశాబ్ద కాలం క్రితం పేద, మధ్యతరగతి ప్రజలు పెళ్లీలు, ఇతర శుభకార్యాలు జరుపుకోవాలన్నా మొదట గుర్తొచ్చేది టీటీడీ కల్యాణమండపాలే అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సామాన్య జనానికి అందుబాటు ధరల్లో లభించే తిరుమల తిరుపతి దేవస్థానం వారి కల్యాణ మండపాలకు ప్రజల్లో ఎంతో ఆదరణ ఉండేది. ఈ క్రమంలోనే మారుమూల ప్రాంతమైన దుబ్బాకలో 2002లో నిర్మించిన కల్యాణ మండపం రెండు దశాబ్దాల పాటు ఒక వెలుగు వెలిగింది. ఫంక్షన్ హాళ్ల సంస్కృతి రాకముందు ఇదే పెళ్లి మండపానికి అసలైన వసతిగా ఉండేది. కల్యాణమండపాన్ని బుక్ చేసుకుని వివాహాలు జరిపించుకునేందుకు జనం పోటీపడేవారు. ప్రస్తుతం అలాంటి కల్యాణమండపం నేడు కళ తప్పింది. ప్రస్తుతం ఆధునిక ఫంక్షన్‌హాళ్ల డెకరేషన్‌కు అనుకూలంగా, అనేక విందు కార్యక్రమాలకు వీలుగా ఉండటంతో టీటీడీ కల్యాణ మండపాలపై జనం ఆసక్తి తగ్గింది. దీంతో గత ఐదేళ్లుగా దుబ్బాక టీటీడీ కల్యాణమండపంలో ఒక్క వివాహం కూడా జరిగిన దాఖలాలు లేవు. దీంతో చెత్త, చెదారం పేరుకుపోయి, కళావిహీనంగా మారింది. కోట్లాది రూపాయలను వెచ్చించి నిర్మించిన మండపాలు నిరుపయోగంగా మారడకుండా, ప్రస్తుత పరిస్థితికి అనువుగా తీర్చిదిద్దితే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కల్యాణ మండపంలో పెళ్లిళ్లు జరగకపోవడంతో వెలవెలబోతున్న ప్రాంగణం

ఇప్పట్లో లేనట్టే!

(3వ పేజీ తరువాయి)

నిధులు విదల్చడం లేదు. ఫలితంగా ఏడాది కాలం నుంచి గ్రామాల్లో ఆర్థిక మాంద్యం నెలకొంది. చిన్నాచితక పనులకు జనరల్ ఫండ్‌తోనే నెట్టుకొస్తున్నారు. కొన్ని సమస్యల విషయంలో కార్యదర్శులు సైతం చేతులెత్తేసే పరిస్థితి దాపురించింది. ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెలు కుంటుపడుతున్నాయనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి.

జిల్లా	గ్రామపంచాయతీలు	వార్డులు
సంగారెడ్డి	633	5,558
సిద్దిపేట	508	4,508
మెదక్	492	4,220

డ్రంకెన్ డ్రైవ్‌లో 13మందికి జరిమానా

గజ్వేల్, మే 7 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 13మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.19,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



అక్కారంలో మాట్లాడుతున్న డీఏవో రాధిక

గజ్వేల్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతుల రసాయన ఎరువుల వాడకాన్ని సాధ్యమైనంత మేర తగ్గించాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి టి. రాధిక సూచించారు. మండలంలోని అక్కారం గ్రామంలో వ్యవసాయ పరిశోధనాస్థానం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని అక్కారంలోని రైతువేదికలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులను వినియోగించవద్దని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు వినియోగించాలని సూచించారు. అంతకు ముందు శాస్త్రవేత్తలు డాక్టర్ శ్వేత, సతీష్ మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువుల ప్రాధాన్యం, పంటకు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, వ్యవసాయ డిప్లొమా విద్యార్థులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు మాజీమంత్రి పూజలు

చిన్నకోడూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవానికి బుధవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఒకప్పుడు మాచాపూర్ చెరువు నిండాలంటే కప్పతల్లి ఆట ఆడేవాళ్లమని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అంబేడ్కర్ సంఘం సభ్యులు మాజీమంత్రిని ఘనంగా సన్మానించారు.

'ఇందిరమ్మ' దరఖాస్తులను త్వరగా పరిశీలించాలి



హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువు పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి గ్రౌండింగ్ కోసం సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. బుధవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులతో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవోలు త్వరగా పరిశీలించాలని, అవసరమైన చోట స్వయంగా వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. రాజీవ్ యువ వికాసం కోసం వచ్చిన యువత నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బ్యాంకులకు పరిశీలన నిమిత్తం పంపించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగపడే విధంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం స్థలాలు గుర్తించాలన్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన అన్ని గ్రామపంచాయతీల్లో డంప్‌యార్డులు ఉండేలా చూడాలని, వందశాతం సెగ్రిగేషన్ షెడ్‌లు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీపీవో దేవకీదేవి, హౌసింగ్ పీడీ దామోదర్‌రావు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, డీఈ మహేశ్, ఏఈ మహేశ్ తదితరులున్నారు.

'ఇందిరమ్మ' ఎంపికలో అనర్హులుంటే నిరూపించండి

● **దుబ్బాక ఎమ్మెల్యేకు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సవాల్**

దుబ్బాక/రాయపోల్, మే 7(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం నిరుపేదలకే ఇళ్లను కేటాయించాలనే కృతనిశ్చయంతో ఉందని, ఎలాంటి అవకతవకలకు తావులేదని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం దుబ్బాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమ గ్రామానికి ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని, బీఆర్ఎస్‌పార్టీ డబుల్ బెడ్రూం ఇళ్లను ఇష్టారీతిగా పంచిందన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన పోతారానికి తాము 16ఇళ్లను కేటాయించామని, ఇంకా అవసరమైతే వందశాతం ఇవ్వడానికి సిద్ధమన్నారు. అర్హులైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఇల్లు లేకుండా ఉంటే ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. అనర్హులకు ఎక్కడైనా ఉంటే నిరూపించాలని దుబ్బాక ఎమ్మెల్యేకు సవాల్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గడీల జనార్దన్‌రెడ్డి, కొంగరి రవి, అనంతుల శ్రీనివాస్, అస శరభయ్య పాల్గొన్నారు. అదేవిధంగా రాయపోల్ మండలంలోని రామారం, సయ్యద్‌నగర్ గ్రామాల్లో బుధవారం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

10న టీజీఎస్ఆర్ జేసీ ప్రవేశ పరీక్ష

సిద్దిపేట కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 10న టీజీఎస్ఆర్ జేసీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను టీజీఎస్ఆర్జేసీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటుందని, అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మద్దూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మద్దూరు మండల కాంగ్రెస్ నాయకులు దాసరి పద్మారెడ్డి, బొమ్మగాని శివయ్య, రామడుగు బాలరాజు, పుల్లూరి రాజు తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా రవీందర్



రవీందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న సబ్బని సత్యం

వర్గల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నల్ల రవీందర్ నియామకమైనారు. బుధవారం మండల పరిధిలోని గౌరారం వద్ద జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో గజ్వేల్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సబ్బని సత్యం నియామక పత్రాన్ని అందజేశారు. మండల ఉపాధ్యక్షులుగా గొర్రె సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూదరి రాజు, సభ్యులుగా మరాటీ కుమార్, గుర్రాల సురేష్, తాళ్ల నర్సింలు గౌడ్, బోప్పిడి ప్రభాకర్‌రెడ్డి, సీరుడి లింగం, ప్రొద్దటూరి శ్రీనివాస్, రాజు, కుమార్, నర్సింలు, నారయణలు నియామకమైనారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని రవీందర్ అన్నారు.

కవి వెంకట్‌కు సన్మానం

చేర్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్యకవి బి.వెంకట్ దర్పణం సాహిత్య సన్మానం పొందారు. బుధవారం దర్పణం సాహిత్య వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అశ్విని ప్రచురణల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిర్వాహకులు కవి వెంకట్‌ను సత్కరించారు.

14న సామూహిక ఖత్నా కార్యక్రమం

సిద్దిపేట కలెక్టరేట్ మే 7 (ఆంధ్రజ్యోతి): మిల్లత్ ఏ ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 14 న సామూహిక ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని సొసైటీ ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మదీనా ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్ అఖాలక్ మాలిక్ చేతుల మీదుగా ఖత్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వాసవీమాత జయంతి



చేర్యాలలోని వైశ్యభవన్‌లో సామూహిక కుంకుమార్చనలో మహిళలు

చేర్యాల/వర్గల్/దుబ్బాక/గజ్వేల్ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకాపరమేశ్వరీమాత జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల అమ్మవారిని స్తుతిస్తూ పారయణాలు, సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. చేర్యాలలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వాసవీమాత ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో నెలకొల్పి స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి వైశ్యభవన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేకపూజలు జరిపారు. వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రం పరిదిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి నిత్యాన్నదానసత్రం అవరణలోని ఆలయంలో ఉదయం ఆలయం వద్ద అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అలగే శ్రీ వాసవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైశ్య సంఘం ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. దుబ్బాకపట్టణంలో ఆర్యవైశ్యభవనంలో పురోహితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మల ఆధర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే గజ్వేల్ పట్టణంలో రామకోటి రామరాజు పసుపుబియ్యాన్ని ఉపయోగించి కన్యకాపరమేశ్వరి అమ్మవారి భారీ చిత్రాన్ని రూపొందించారు.



దుబ్బాకలో వాసవి మహిళాసంఘం ఆధ్వర్యంలో పూజలు

సీఐటీయూ విజయం కార్మికులదే: చుక్క రాములు

గజ్వేల్, మే 7 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ విజయం కార్మికుల విజయమని, కార్మికుల సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాణే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్‌పై సీఐటీయూ 34 ఓట్లతో విజయం సాధించిందని వారు ప్రకటించారు. పరిశ్రమలో 155 ఓట్లు ఉండగా సీఐటీయూకు 94 ఓట్లు, బీఎంఎస్‌కు 60 ఓట్లు పడ్డాయని, ఒకరు ఓటు వేయలేదని వివరించారు. అనంతరం కార్మికులందరూ గెలిచిన అభ్యర్థులకు పూలమాలలతో సత్కరించి, టపాకాయలు కాలుస్తూ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం పరిశ్రమ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

దేశ భద్రత అందరి బాధ్యత: ఏబీవీపీ

సిద్దిపేట కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రత అనేది కేవలం దేశ రక్షణ దళాలు, పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు అన్నారు. యుద్ధం అనివార్యం ఐతే పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అవగాహన, అప్రమత్తత, సన్నద్ధత కేంద్రాలుగా మారాలన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జరగుతున్న పాలిసెట్ ఉచిత బోధన తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా 120 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు.

దేశ ప్రజలు ఏకమవ్వాలి: అత్తు ఇమామ్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 7: పహల్గాంలో విచక్షణ రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పే సమయం వచ్చిందని, అందుకు దేశ ప్రజలంతా ఏకం కావాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా తీవ్రవాద సంస్థలను, ఉగ్రవాదులను ఏరి పారేయాలని తెలిపారు. ఈ సమయంలో కులమతాలు, రాజకీయాలకతీతంగా దేశం కోసం మనమంతా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, నవాజ్, మహేష్, ఫయాజుద్దీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ అభివృద్ధికి పెద్దపీట: తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, మే 7(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ అభివృద్ధికి పెద్దపీట వేస్తామని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. పట్టణంలోని ఢిల్లీ వాలా హోటల్ వద్ద నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు తదితరులున్నారు.

హుస్నాబాద్‌కు ఆటో కార్మికుల రథయాత్ర

హుస్నాబాద్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రథయాత్ర బుధవారం హుస్నాబాద్‌కు చేరింది. ఈ సందర్భంగా ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మహాలక్ష్మి పథకం పెట్టినప్పుడు ఆటో కార్మికులను ఆదుకుంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలలు గడచినా పట్టించుకోవడం లేదన్నారు. ఆటోలు నడవక అప్పుల పాలై కార్మికుల కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లో వేలాది మంది ఆటో కార్మికులతో పెద్ద ఎత్తున మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, ఆటో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి లబ్ధిని రూ.1.50లక్షలకు పెంచాలి

జగదేవ్‌పూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకొని కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల కింద అందజేసే సాయాన్ని రూ.1.50లక్షలకు పెంచి పేదలను ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 100 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ నిర్మల, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలి

సిద్దిపేట కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ట్రాఫిక్ రూల్స్, రోడ్డు నిబంధనలు తెలుసుకోవడం చాలా ముఖ్యమని సిద్ధిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట శిర్డీ సాయి బాబా ఆలయంలో వ్యాస మహర్షి యోగ సొసైటీ వారు నిర్వహిస్తున్న బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సీఐ ప్రవీణ్ కుమార్‌తో ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించారు.